అర్ధంతరంగా జీవితాన్ని ముగించుకోవద్దు


డాక్టర్ విజయ్ భాస్కర్ సన్మానిస్తున్న మోతుకూరి రాంచందర్, సుధాకర్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మహేంద్రకుమార్‌రెడ్డి

చిక్కడపల్లి: ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ మంగళవారం చిక్కడపల్లిలోని నగర కేంద్ర గ్రంథాలయం సెమినార్ హాలులో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆర్థోపెడిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డా. విజయ్‌భాస్కర్ మాట్లాడారు. అర్ధంతరంగా జీవితాన్ని ముగించుకోవద్దని... నవ్వుతూ జీవితంలో ముందుకు సాగాలన్నారు. అంతర్జాలం, సామాజిక మాధ్యమాలలో పడి బంధుత్వాలు కనుమరుగు అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆత్మహత్యలతో విలువైన మానవ వనరులను దేశం నష్టపోతుందన్నారు. ప్రభుత్వం మానసిక ఆరోగ్యాన్ని పరిరక్షించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ కోశాధికారి శ్రీపూజ ఆత్మహత్య నివారణ చర్యలు అనే అంశంపై అవగాహన కల్పించాలచారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మోతుకూరి రాంచందర్, కార్యదర్శి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు ఎదుర్కోండి..
ఆత్మహత్యలు చేసుకోకండి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: జీవితం అమూల్యమైందని ఎవరూ ఆత్మహత్యలు చేసుకోవద్దని వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డా. మహేంద్రకుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో పీపీఏబి నవ భారత లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జీవితం ఒక ప్రయాణం లాంటిదని ఈ ప్రయాణంలో ఎన్నో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అందుకు నిరాశ, నిస్పృహలకు గురి కాకుండా ధైర్యంతో ఎదుర్కోవాలని సూచించారు. ఏమైనా సమస్యలు వస్తే స్నేహితులు, కుటుంబ సభ్యులకు తెలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్, లయన్ అంజయ్య, ప్రిన్సిపల్ వాణిశ్రీ, కృష్ణవేణి, స్వరూపారాణి తదితరులు పాల్గొన్నారు.

మతం మారిన దళితులను ఎస్సీలుగా గుర్తించాలి

కాచిగూడ: దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని అణగారిన క్రైస్తవ జన సమాఖ్య జాతీయ కన్వీనర్ నగాళ్ల పోచయ్య ఇశ్రాయేల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌ను కలిసి దళిత క్రైస్తవుల డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దళిత క్రైస్తవులను బీసీ–సీ జాబితాలోనే కొనసాగిస్తే ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యేక ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. కేంద్రం, రాష్ట్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. మతం మారిన సిక్కులను ఎస్సీలుగా, మతం మారిన బౌద్ధులను ఎస్టీలుగా గుర్తించినప్పుడు, మతం మారిన దళితులను ఎస్సీలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. దళిత క్రైస్తవుల డిమాండ్లను వెంటనే పరిష్కరించే విధంగా ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని ఆయన కోరారు.

బీసీ కుల గణనపై హైకోర్టు తీర్పు హర్షణీయం

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ



ముషీరాబాద్: మూడు నెలల్లో బీసీ కుల గణన పూర్తి చేసి నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించడం పట్ల బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. ఐదేళ్ల క్రితం తాను బీసీ కుల గణనపై రిట్ పిటిషన్ దాఖలు చేశానని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకుండా నిర్లక్ష్యం చేయడంతో కేసు ఆగిపోయిందని తెలిపారు. ఎట్టకేలకు దీన్నిపై విచారించిన ధర్మాసనం మూడు నెలల్లో కుల గణన పూర్తి చేయాలని ఆదేశించడం తమ విజయమని పేర్కొన్నారు. 2019లో నాటి కేసీఆర్ ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకుండా నాలుగేళ్ల పాటు సాంకేతిక కారణాలతో తొక్కి పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు ఇదే పిటిషన్‌లో బీఆర్‌ఎస్ అనుకూల శక్తులతో ఇంప్లీడ్ చేయించి కేసును ముందుకు కదలకుండా చేసినప్పటికీ మొక్కవోని దీక్షతో ఈ కేసుపై పోరాటం చేశానని తెలిపారు. ఈ తీర్పును తక్షణమే అమలు చేయాలని సమగ్ర కుల గణన లెక్కలను నోటిఫై చేసి దాని ప్రాతిపదికగా తీసుకొని అధికారికంగా ప్రకటించాలని తెలిపారు. దానికి అనుగుణంగా 42 శాతం రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని ఆయన సూచించారు. లేకుంటే బీసీలందరూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేపడతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు జెల్లపల్లి అంజి, సతీష్, హేమంత్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

పండ్ల పంపిణీ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మాతా వాకర్స్ క్లబ్ నల్లకుంట ఆధ్వర్యంలో మంగళవారం కోఠిలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో సుమారు 150 మంది బాలింతలకు పండ్లు, బిస్కెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు డా. మురళీధర్, ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు బి.నాగభూషణం, సూపరింటెండెంట్ డా. సుజాత, ఆర్‌ఎంవో డా. శోభ, తదితరులు పాల్గొన్నారు.

జనగామ జిల్లాకు చాకలి ఐలమ్మ పేరు పెట్టాలి

వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహానికి ప్రజాప్రతినిధుల నివాళులు



చాకలి ఐలమ్మకు నివాళులర్పిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ తదితరులు

కవాడిగూడ: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ తొలి, మలి దశ ఉద్యమ స్ఫూర్తితోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యిందని పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళవారం చాకలి ఐలమ్మ 39వ వర్ధంతిని తెలంగాణ రజక (ధోబీ) అభివృద్ధి సంస్థ గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ ఎం.నర్సింహ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్, కవాడిగూడ కార్పొరేటర్ జి. రచనశ్రీ, మాజీ కార్పొరేటర్లు టి.రవిందర్, వి. శ్రీనివాస్‌రెడ్డి, దైవాజ్ఞశర్మ తదితరులు ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో మహిళల హక్కుల కోసం నేటి యువత పాటుపడాలని పిలుపునిచ్చారు.

ట్యాంక్‌బండ్‌పై ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయాలి..

చైర్మన్ నర్సింహ మాట్లాడుతూ.... జనగామ జిల్లాకు చాకలి ఐలమ్మ పేరు పెట్టడంతో పాటు ట్యాంక్‌బండ్‌పై ఆమె విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రజక (ధోబి) అభివృద్ధి సంస్థ వర్కింగ్ చైర్మన్ మండలపు గాంధీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపల్లి రాజశేఖర్, రాష్ట్ర కార్యదర్శులు కొండమీది హరినాథ్, బొడ్డుపల్లి చుక్కయ్య, రాష్ట్ర కాంగ్రెస్ మహిళా నాయకురాలు ఇందిరా శోభన్, బీజేపీ నేతలు వెంకటేష్, మహేందర్‌బాబు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బాగ్‌లింగంపల్లిలోని రాజ్యాధికార సమితి కేంద్ర కార్యాలయంలో..

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: చాకలి ఐలమ్మ స్ఫూర్తితో మహిళలకు అన్ని రంగాల్లో అవకాశం కల్పించాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్ డిమాండ్ చేశారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని రాజ్యాధికార సమితి కేంద్ర కార్యాలయంలో ఐలమ్మ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దాసు సురేష్ మాట్లాడుతూ... తెలంగాణ సాయుధ పోరాటంలో వీరనారి ఐలమ్మ భూమి కోసం.. భుక్తి కోసం పోరాటం చేస్తూ దొరలను తరిమికొట్టిందని గుర్తు చేశారు. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. అంతేకాకుండా బీసీ మహిళలకు తగినంత అవకాశాలు లేకపోవడం అత్యంత బాధాకరమన్నారు.



నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ, మాజీ కార్పొరేటర్ వి. శ్రీనివాస్‌రెడ్డి, దాసు సురేష్

ఫీవర్ సేవలపై ఎమ్మెల్యే ఆరా

- ఆస్పత్రిలోని నూతన ఓపీ భవనం పరిశీలించిన ఎమ్మెల్యే కాలేరు
- రక్త నమూనా పరీక్షల్లో జరుగుతున్న జాప్యంపై అసహనం
- రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశం
- ఆస్పత్రిలో డయాగ్నోస్టిక్ సెంటర్ ఏర్పాటు చేయిస్తానని హామీ


ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు

నల్లకుంట: సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న వేళ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ జయలక్ష్మికి సూచించారు. మంగళవారం ఫీవర్ ఆస్పత్రిని సందర్శించిన ఎమ్మెల్యే ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌తో కలిసి అక్కడి ఆవరణలో నూతనంగా నిర్మించిన ఓపీ బ్లాక్ భవనాన్ని పరిశీలించారు. అనంతరం ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌తో సమావేశమై అక్కడ నమోదవుతున్న డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితరుల కేసులపై ఆరా తీశారు. అలాగే ఆస్పత్రిలో ఉన్న అరకొర సిబ్బంది, ల్యాబుల్లో రక్త నమూనా పరీక్షల్లో జరుగుతున్న జాప్యంపై ఎమ్మెల్యే ఒకింత అసహనం వ్యక్తం చేశారు. సీజనల్ వ్యాధులకు అవసరమయ్యే మందులను అందుబాటులో ఉంచి రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు. అలాగే కొత్తగా నిర్మించిన ఓపీ బ్లాక్ ప్రారంభోత్సవంపై ప్రభుత్వ పెద్దలతో మాట్లాడతానని చెప్పారు. అలాగే పేద రోగుల సౌకర్యార్థం ఆస్పత్రిలో నూతనంగా ఓ డయాగ్నోస్టిక్ సెంటర్ ఏర్పాటు చేయించేలా ప్రతిపాదనలు కూడా తయారు చేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం డీఎంతో ఫోన్‌లో మాట్లాడి ఆస్పత్రిలో వైద్యుల కొరత, డెంగీ నిర్ధారణ పరీక్షల్లో జరుగుతున్న జాప్యానికి గల కారణాలపై ఆరాతీశారు.

డా.చారీలేన్ సమస్యలు వెంటనే పరిష్కరించండి

వివిధ శాఖల అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం


స్థానికుల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాలేరు

నల్లకుంట: పాత నల్లకుంట డాక్టర్ చారిలేన్ తదితర ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ హామీ ఇచ్చారు. డాక్టర్ చారీలేన్‌లో దశాబ్దాల క్రితం చేసిన డ్రైనేజీ పైప్‌లైన్‌లో ఏర్పడుతున్న లీకేజీలు, వెలగని స్ట్రీట్ లైట్లు, ఛిద్రమైన రోడ్లు తదితర సమస్యలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. దీంతో చేసేది లేక స్థానికులు ఎమ్మెల్యే కాలేరు వద్దకు వెళ్లి సమస్యలను వివరించారు. మంగళవారం ఆయన జీహెచ్‌ఎంసీ, జలమండలి, స్ట్రీట్ లైట్ల అధికారులతో కలిసి ఆ ప్రాంతంలో పర్యటించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు రమణా, శేఖర్‌రెడ్డి, లక్ష్మణ్, రోహిత్, పీఎస్.చారి, మురళీయాదవ్, రవిరాజ్, ఏఎంహెచ్‌వో డా. హేమలత, జలమండలి మేనేజర్ భాస్కర్, డీఈ ప్రశాంతి, ఏఈ మనీషా, ఎంటమాలజీ అధికారి అంబిక తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి

అంబర్‌పేట: అంబర్‌పేట నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు సహకరించాల్సిందిగా జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు ఆమ్రపాలిని మంగళవారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కోరారు. నియోజకవర్గంలో చేపట్టే అభివృద్ధి పనులకు కావాల్సిన నిధులు కేటాయించాలని వినతి పత్రం అందజేశారు. గతంలో చేపట్టిన పనులకు కొనసాగింపుగా మరిన్ని నిధులు అవసరమవుతాయని ఆయన వివరించారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించారన్నారు.


జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నేడు రాధాష్టమి మహోత్సవం

నల్లకుంట: నల్లకుంట డివిజన్ పరిధిలోని టీఆర్టీ కాలనీలో ఉన్న కుసుమ హరనాథ ఆశ్రమంలో ఈనెల 11న రాధాష్టమి మహోత్సవం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆశ్రమ ట్రస్ట్ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు రాధమ్మకు మహాభిషేకం ఉంటుందన్నారు. అనంతరం అమ్మవారికి పుష్పాభిషేం, హారతి ఉంటుందని తెలిపారు. ఈ వేడుకల్లో అబిడ్స్ ఇస్కాన్ ఆలయం నుంచి స్వామిజీలు పాల్గొంటారని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రాధాకృష్ణుల కృపకు పాత్రులు కావాలని కోరారు.

అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

చిక్కడపల్లి: శిఖరం ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఎక్సలెన్సీ అవార్డులను ప్రదానం చేస్తున్నామని సంస్థ కార్యదర్శి జి.కృష్ణ తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన వివేక్‌నగర్‌లో మాట్లాడుతూ... సంగీత, నృత్య, సాహిత్య, విద్యా, వైద్యం, వివిధ రంగాలలో రాణిస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు ఈనెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు ఫోన్ నం.94945 23562లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

రైలుకింద పడి యువకుడు ఆత్మహత్య

కాచిగూడ: రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... ముంబాయికి చెందిన నాగ్‌నాథ్ నామ్‌దేవ్ పవార్ (37) సోమవారం రాత్రి కాచిగూడ రైల్వే స్టేషన్‌లో ఎంఎంటీఎస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎట్టకేలకు స్పందించారు


అరుంధతినగర్‌లో చెత్తను శుభ్రం చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

చిక్కడపల్లి: పేరుకుపోతున్నా పట్టించుకోరా.? అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. మంగళవారం ఎస్ఎస్ఏ గోవర్ధన్, జవాన్ నర్సింగ్‌రావు పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. సమస్య పరిష్కారం కావడంతో బస్తీ అధ్యక్షుడు మెరుగు శ్రీనివాస్‌యాదవ్ 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

బ్రాహ్మణ పరిషత్‌ను పునరుద్ధరించాలి

టీబీఎస్ఎస్ అధ్యక్షుడు రమణారావు


ఏఐసీసీ కార్యదర్శి కోట నీలిమను సన్మానిస్తున్న టీబీఎస్ఎస్ అధ్యక్షుడు రమణారావు

నల్లకుంట: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బ్రాహ్మణులకు అవకాశం కల్పించాలని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి(టీబీఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు అన్ని రాజకీయ పార్టీలను కోరారు. మంగళవారం టీబీఎస్ఎస్ ప్రతినిధి బృందం ఏఐసీసీ కార్యదర్శి కోట నీలిమను మర్యాదపూర్వకంగా కలిసి బ్రాహ్మణ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ.. ప్రస్తుతం బ్రాహ్మణులకు రాజకీయ అవకాశాలు పూర్తిగా తగ్గిపోయాయని, జనాభా దామాషా ప్రకారం త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు బ్రాహ్మణులకు అవకాశాలు కల్పించాలన్నారు. తెలంగాణ బ్రాహ్మణ పరిషత్‌ను పునరుద్ధరించేలా రాష్ట్ర ప్రభుత్వానికి సూచించాలని విజ్ఞప్తి చేశామన్నారు. బ్రాహ్మణ పరిషత్ అమలులోకి వస్తే విదేశాలకు వెళ్లే ప్రతిభావంతులైన పేద బ్రాహ్మణ విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థిక చేయూత అందుతుందని అన్నారు. తమ వినతికి ఏఐసీసీ కార్యదర్శి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

మంత్రివర్గంలో గడ్డం వివేక్‌కు అవకాశం ఇవ్వాలి

డీఎస్‌డీ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేబినెట్ మంత్రి వర్గంలో ఎమ్మెల్యే డా. గడ్డం వివేక్‌కు అవకాశం కల్పించాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ డెఫ్ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన వ్యక్తి రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన వ్యక్తి గడ్డం వివేక్ అని అన్నారు. మంత్రి వర్గంలో చేర్చుకొని దివ్యాంగులు, మహిళా శిశు సంక్షేమ శాఖలు అప్పగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌డీ కార్యదర్శి భారతి, ఉపాధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా బీజేపీ సభ్యత్వ నమోదు

నల్లకుంట: రాష్ట్రంలో కోటి మందిని బీజేపీలో సభ్యులుగా చేర్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని నల్లకుంట కార్పొరేటర్ అమృత పేర్కొన్నారు. మంగళవారం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి చౌరస్తా సమీపంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. దీనికి హాజరైన కార్పొరేటర్ సభ్యత్వ నమోదు ఎలా పొందాలో వివరించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం జోరుగా సాగుతోందని ఆమె అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, నాయకులు వెంకటేష్‌గౌడ్, శ్యామ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో నిమజ్జన ఏర్పాట్లు

అంబర్‌పేట: గణేష్ నిమజ్జనానికి ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో ఏర్పాట్లు చేస్తోందని డీఎంసీ మారుతీ దివాకర్ తెలిపారు. గణేష్ నిమజ్జనానికి అంబర్‌పేటలో ఉన్న మార్గాలపై పోలీసు, జలమండలి, విద్యుత్, పారిశుద్ధ్య అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. అయ్యప్ప టెంపుల్ రోడ్, ఆలీ కేఫ్, శివం రోడ్ తదితర ప్రాంతాల్లో నిమజ్జనం ఏర్పాట్లకు కావాల్సిన సూచనలు చేశారు. చెట్ల కొమ్మలు, రోడ్ల గుంతలు, విద్యుత్ కేబుళ్లు, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని అన్నారు.

మహేష్‌కుమార్‌గౌడ్ ప్రమాణస్వీకారానికి తరలిరావాలి


మాట్లాడుతున్న బాలరాజ్‌గౌడ్, విజయ్‌కుమార్‌గౌడ్, వెంకన్నగౌడ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ ప్రమాణ స్వీకారోత్సవానికి గౌడ కుల సంఘాలతో పాటు బహుజనులు పెద్ద ఎత్తున తరలి రావాలని తెలంగాణ గౌడ కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజ్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్‌గౌడ్, కన్వీనర్ వెంకన్నగౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం చిక్కడపల్లిలోని సమన్వయ కమిటీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 30 ఏళ్ల తర్వాత బహుజన జాతికి చెందిన మహేష్‌కుమార్‌గౌడ్‌కు అధ్యక్ష పదవి అప్పగించడం హర్షణీయమని అన్నారు. త్వరలో అన్ని గౌడ సంఘాల ఆధ్వర్యంలో మహేష్‌కుమార్‌గౌడ్‌కు పెద్ద ఎత్తున సన్మాన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. అంతేకాకుండా మూడు నెలల్లో కుల గణన చేపట్టాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ ఐక్య సాధన సమితి అధ్యక్షుడు నారాయణగౌడ్, ఐలన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దండాలయా.. ఉండ్రాళ్లయా.!

అంబర్‌పేట, ముషీరాబాద్ జోన్ పరిధిలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయాలు, మండపాల వద్ద మధ్యాహ్నం వేళల్లో అన్నదాన కార్యక్రమాలు జరుగుతున్నాయి. సాయంత్రం వేళల్లో గణనాథుడికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. గణేశ్ మహరాజ్‌కి జై అనే నినాదాలతో మండపాల పరిసరాలు మార్మోగాయి. పలు ప్రాంతాల్లో సోమవారం అర్ధరాత్రి వరకు గణేశ్ నిమజ్జన వేడుకలు కొనసాగాయి.
– అంబర్‌పేట, ముషీరాబాద్ జోన్ బృందం


ముషీరాబాద్ మహంకాళి దేవాలయంలో పూజలు


కచేరి చేసిన రాఘవేంద్రను అభినందిస్తున్న ఈవో లక్ష్మారెడ్డి


మహా గణపతి వద్ద బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు


భస్మార్చన విభూతి అలంకరణలో లక్ష్మీగణపతి


చిక్కడపల్లి పృథ్వీ అపార్ట్‌మెంట్ మండప పూజలో ఉమాదేవి


వరసిద్ధి వినాయక మండప పూజలో కార్పొరేటర్ పావని, వినయ్‌కుమార్ దంపతులు, సభ్యులు, చిన్నారులు


పటేల్‌నగర్ చౌరస్తాలో.. కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్


న్యూ పటేల్‌నగర్‌లోని మండపంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్


బీఆర్‌ఎస్ బీసీసెల్ అధ్యక్షుడు ఉమాకాంత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్


చిక్కడపల్లిలో జరిగిన అన్నదానం కార్యక్రమంలో భరత్‌గౌడ్


నింబోలిఅడ్డలో గణపతికి పూజలు చేస్తున్న ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ నర్సయ్య


ముషీరాబాద్‌లోని శివాలయం వద్ద.. ఎమ్మెల్యే ముఠా గోపాల్


కార్పొరేటర్ పావని దంపతులను సన్మానిస్తున్న నిర్వాహకులు